ప్రజాశక్తి

శనివారం 15 జూన్ 2024 5

కర్నూలు

మంత్రులకు శాఖల కేటాయింపు

- ఫరూక్‌కు మైనార్టీ..బీసీకి ఆర్అండ్‌బి
- భరత్‌కు పరిశ్రమల శాఖ కేటాయింపు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

చంద్రబాబు మంత్రివర్గంలోని మంత్రులకు శాఖలు కేటాయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం గెజిట్ ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి గెలుపొందిన ముగ్గురు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు కేటాయించిన సంగతి తెలిసిందే. తాజాగా వారికి శాఖలను కేటాయించారు. నంద్యాల నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎన్ఎండి ఫరూక్‌కు న్యాయ శాఖ, మైనార్టీ శాఖలను అప్పగించారు. బనగానపల్లె నుంచి ఎమ్మెల్యేగా బీసీ జనార్ధన్ రెడ్డికి రోడ్లు, భవనాలు, పెట్టుబడుల శాఖలను కేటాయించారు. కర్నూలు నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన టిజి భరత్‌కు పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖలను అప్పగించారు. ఎన్ఎండి ఫరూక్ 1981లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. 1981లో నంద్యాల కౌన్సిలర్‌గా ఎన్నికై మున్సిపల్ వైస్ ఛైర్మన్‌గా పని చేశారు. 1985 నుంచి 1988 వరకు చక్కెర పరిశ్రమల, వక్ఫ్ బోర్డు శాఖ మంత్రి పని చేశారు. 1994 నుంచి 1999 వరకూ శాసన సభ డిప్యూటీ స్పీకర్‌గా, 1999 నుంచి 2003 వరకు మున్సిపల్, వక్ఫ్ బోర్డు శాఖ మంత్రిగా, 2003 నుంచి 2004 వరకు ఉన్నత విద్యా శాఖ, వక్ఫ్ బోర్డు శాఖ మంత్రిగా పని చేశారు. 2017 నుంచి 2018 వరకూ మండలి ఛైర్మన్‌గా, 2018 నుంచి 2019 వరకూ ఆరోగ్య శాఖ మంత్రిగా, 2019 నుంచి 2023 వరకూ ఎమ్మెల్సీగా పని చేశారు. బీసీ జనార్ధన్ రెడ్డి 2012లో తెలుగుదేశం పార్టీలో చేరి నియోజకవర్గ ఇన్చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. 2014, 2024 ఎన్నికల్లో బనగానపల్లె ఎమ్మెల్యేగా విజయం సాధించారు. టిజి భరత్ 2014లో టిడిపిలో చేరారు. 2019 ఎన్నికల్లో కర్నూలు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో కర్నూలు నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

జిల్లాకు న్యాయం జరిగేనా..?

ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులకు కేటాయించిన శాఖలతో ఉమ్మడి కర్నూలు జిల్లాకు న్యాయం జరుతుందా లేదా అని ప్రజల్లో చర్చ సాగుతోంది. ఎన్ఎండి ఫరూక్‌కు కేటాయించిన న్యాయ శాఖ ద్వారా టిడిపి హామీ ఇచ్చిన కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటు సాధ్యం అవుతుందని పలువురు అంటున్నారు. మైనార్టీ శాఖ ద్వారా జిల్లాలోని మైనార్టీలకు మేలు జరిగే ఆస్కారం ఉందని చెబుతున్నారు. బీసీ జనార్ధన్ రెడ్డికి రోడ్లు, భవనాల శాఖ కేటాయించడం ద్వారా జిల్లాలోని రోడ్ల పరిస్థితి మారుతుందేమే వేచి చూడాలి. టిజి భరత్‌కు కేటాయించిన పరిశ్రమల శాఖ ద్వారా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు సాధ్యమవుతుందో లేదో, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ రూపురేఖలు మారుస్తారో లేదో అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

బీసీ.జనార్ధన్‌రెడ్డి

ఎన్ఎమ్‌డి.ఫరూక్

టిజి.భరత్

భద్రత లేని బడి బస్సులు

- దినదినమూ గండమే
- చిన్నారుల ప్రాణాలతో చెలగాటం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలు అన్నీ తమ పిల్లల బంగారు భవిష్యత్తు చుట్టూనే తిరుగుతుంటాయి. వారికే చిన్న కష్టం వచ్చినా వారు విలవిల్లాడిపోతుంటారు. ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లిన చిన్నారులు తిరిగి సురక్షితంగా ఇంటికి చేరుకునే వరకు వారు ఎప్పుడు ఎక్కడ ఏం జరుతుందనే ఆలోచనతోనే గడుపుతుంటారు. ఎక్కడ స్కూలు బస్సు ప్రమాదానికి గురైందన్నా వారు అది ఏ స్కూలు బస్సో తెలిసే వరకు వణికిపోతుంటారు. బస్సులో వెళ్లిన పిల్లలు స్కూలుకు చేరారా? ఇంటికి క్షేమంగా చేరుతున్నారా? అనేవి ఆరోజు గడిచే వరకు తల్లిదండ్రులకు ప్రశ్నార్థకాలే. కార్పొరేట్ చదువుల్లో ఇదంతా దినదిన గండం దీర్ఘాయుష్షు చందంగా సర్వసాధారణమై పోయింది. పలు చోట్ల స్కూలు బస్సులు ఘోర ప్రమాదాలకు గురవుతుండటం, పదుల సంఖ్యలో చిన్నారులు మృత్యువాత పడటమో, క్షతగాత్రులు కావడమో ఈ దుస్థితికి కారణం...

ప్రయివేటు పాఠశాలల బస్సులు చట్ట ప్రకారం నిబంధనలు అన్నీ పాటించి తీరాలని, ఫిట్‌నెస్ ధ్రువీకరణ ఉండాలని రవాణా శాఖ అధికారులు నిర్దేశిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 1,014 ప్రయివేటు పాఠశాలల బస్సులు ఉన్నాయి. వాటిలో ఇప్పటి వరకూ 911 బస్సులు ఫిట్‌నెస్ పొందాయి. ఇంకా 103 బస్సులు ఫిట్‌నెస్ లేకుండా నడుస్తున్నాయి. కర్నూలు జిల్లాలో 416 ప్రయివేటు పాఠశాలల బస్సులు ఉండగా వాటిలో 350 బస్సులు ఫిట్‌నెస్ కలిగి ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 598 ప్రయివేటు పాఠశాలల బస్సులు ఉండగా వాటిలో 561 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికేట్ ఉంది. మిగిలిన బస్సులు ఫిట్‌నెస్ లేకుండానే విద్యార్థులను తరలించేందుకు ఉపయోగిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా అనుమతి పొందిన పాఠశాలలు తమ విద్యార్థులను తీసుకెళ్లేందుకు ఆటోలు, టాటా మ్యాజిక్‌లనూ ఉపయోగిస్తున్నాయి. పది మందికి మాత్రమే అనుమతి ఉన్న టాటా మ్యాజిక్‌లో 20 మందికిపైగా చిన్నారులను తరలిస్తున్నారు. దీనికి తోడు పాఠశాల వాహనాలకు ఉండాల్సిన కనీస నిబంధనలనూ పాటించడం లేదు. లోపల ఖాళీ లేక చిన్నారుల పుస్తకాల బ్యాగులను వాహనం బయటి వైపున వేలాడదీస్తున్నారు. సింగిల్ రోడ్డు ఉన్న ప్రాంతాలో ఎదుటి వాహనానికి తగలకుండా వాహనాన్ని తప్పించినా చిన్నారుల బ్యాగులు ఎదుటి వాహనానికి తగులుకోవడం వల్ల కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

లైసెన్స్ లేని డ్రైవర్లు..

ప్రయివేటు పాఠశాలల బస్సుల డ్రైవర్లలో 50 శాతం మందికి పైగా డ్రైవింగ్ లైసెన్స్‌లు లేవు. అసలు లైసెన్సులేని వారిని డ్రైవర్లుగా నియమించకూడదు. ఈ నిర్లక్ష్యం పిల్లల ప్రాణాలతో చెలగాటమే అవుతుంది. లెసెన్సు లేని వారిని డ్రైవర్లుగా తీసుకోకూడదని రవాణ శాఖ ఉన్నతాధికారులు పాఠశాల యాజమాన్యాలను హెచ్చరించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలోనూ యాజమాన్యాలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అయినా ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ఈ ప్రమాదాల నివారణకు చట్ట పరంగా తగిన ముందస్తు చర్యలేమీ తీసుకోవడం లేదు. బస్సుకు లైసెన్స్‌గల డ్రైవర్ ఉన్నా, అతను అందుబాటులో లేని సమయాల్లో ఒక్కోసారి ఆ బస్సు క్లీనరే బస్సును నడుపేస్తుంటాడు. అలాంటప్పుడు వాహన చోదకంలో అనుభవరాహిత్యం వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువగా ఉంటోంది. లెసెన్సు సహా అనుభవం ఉన్నవారినే స్కూలు బస్‌కు డ్రైవరుగా నియమించుకోవాల్సి ఉంటుంది.

స్కూలు బస్సులకు సుప్రీం మార్గదర్శకాలివి...

ప్రయివేటు పాఠశాలల బస్సులు తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలను సుప్రీం కోర్టు గతంలోనే వెల్లడించింది. అవి ఇలా ఉన్నాయి...

- బస్సు ముందు, వెనక భాగాల్లో 'పాఠశాల బస్సు' అని తప్పనిసరిగా రాయాలి.
- అద్దె బస్సు అయితే 'ఆన్ స్కూల్ డ్యూటీ' అని స్పష్టంగా ఉండాలి.
- బస్సులో ప్రాథమిక చికిత్స పెట్టె తప్పనిసరిగా ఉండాలి.
- పిల్లలు విండోలోంచి తలలు, చేతులు బయటకు పెట్టకుండా వాటికి నిలువు పట్టీలు సహా అడ్డంగానూ పట్టీలు ఉండాలి.
- ఏ ప్రమాదం జరిగిన సురక్షితంగా పిల్లలు బయటపడేందుకు అత్యవసరం ద్వారా ఉండాలి.
- పాఠశాల పేరు, ఫోన్ నంబర్ బస్సుపై రాయాలి.
- బస్సు ద్వారాలకు సురక్షితమైన, పటిష్టమైన గొళ్లాలు ఉండాలి.
- విద్యార్థులు తమ బ్యాగులను ఉంచేందుకు బస్సులోనే విడిగా స్థలం ఉండాలి.
- బస్సులో పిల్లల అవసరాలు తీర్చేందుకు విధిగా ఒక అటెండర్ ఉండాలి.
- గంటకు 40 కిలోమీటర్ల వేగం మించకుండా ఉండేందుకు బస్సుకు స్పీడ్ గవర్నెన్స్ ఏర్పాటు చేయాలి.
- చూసిన వెంటనే అది స్కూలు బస్సు అని గుర్తించి మిగతా వాహనాల వారు తగినంత జాగ్రత్త వహించేందుకువ వీలుగా బస్సు రంగు విధంగా చిక్కని పసుపు రంగులో ఉండాలి.
- 12 ఏళ్లలోపు చిన్నారులయితే పర్మిట్ కలిగి ఉన్న దానికి 1.5 రెట్లు ఎక్కువ మందిని, 12 ఏళ్ల పైనున్న వారయితే పర్మిట్ పొందిన సంఖ్యకు మించి విద్యార్థులను తీసుకెళ్లకూడదు.
- బస్సు డ్రైవర్‌కు లైసెన్స్‌తో పాటు కనీసం నాలుగేళ్ల అనుభవం ఉండాలి.
- బస్సు డ్రైవర్ వద్ద విధిగా ఆ ఆ బస్సులో ప్రయాణిస్తున్న బాలబాలికల పేర్లు, చిరునామాలతో పూర్తి వివరాల జాబితా ఉండాలి.

ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం

ప్రయివేటు పాఠశాలల బస్సులకు సంబంధించి సోమవారం నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం. ఇప్పటికే ఫిట్‌నెస్ లేని బస్సుల వివరాలను సేకరించాం. ప్రతి బస్సు ఫిట్‌నెస్ తప్పక కలిగి ఉండాలని చెబుతున్నాం. ఇప్పటికే చాలా వరకూ బస్సులు ఫిట్‌నెస్ పొందాయి. ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకుంటాం.

- రమేష్, కర్నూలు ఆర్‌టిఓ.

సిఐటియు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

- రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ కెజి.గోవిందరెడ్డి ప్రారంభం
- పర్స సత్యనారాయణ శతజయంతి సభ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి కార్మికులకు పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా పర్స సత్య నారాయణ శతజయంతి ఉత్సవాలు ముగింపులో భాగంగా సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో డాక్టర్ కెజి. గోవింద్ రెడ్డి మాట్లాడుతూ జీవితంలో ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. దేశంలో మూడు కోట్ల 50 లక్షల మందికి రక్తం అవసరం అవుతుండగా రెండు కోట్ల 50 లక్షల మంది రక్తదానం చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఇంకా దాదాపు కోటి మందికి రక్తం అందుబాటులోకి రాక ప్రాణాలు కోల్పోవలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అందుకని ప్రతి ఒక్కరూ రక్తం దానం చేయడంతో పాటు రక్తదానం పైన అవగాహన కల్పించడానికి కార్మికులు కృషి చేయాలని కోరారు. రక్తం ఇవ్వడం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని రక్తం ఇచ్చిన వెంటనే కొత్త రక్తం ఉత్పత్తి అవుతుందన్నారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన సిఐటియు జిల్లా కమిటీని అభినందించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ దేశాయ్ మాట్లాడుతూ రక్తదానం చేయడంలో ఎంతో సేవ ఉందని అన్నారు. పశ్చిమబెంగాల్‌లో జ్యోతిబసు నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం పశ్చిమబెంగాల్‌కు వ్యతిరేకంగా అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా ప్రాజెక్టులు నిర్మాణం కోసం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది రక్తదానం చేసి ప్రాజెక్టులు నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు. దాని తర్వాతే కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణానికి కషి చేసిందని అన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో భాగంగా రక్తదానం చేయడానికి సిద్ధం కావాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు మాట్లాడుతూ సిఐటియు అంటే పోరాటాలు ఉద్యమాలు మాత్రమే కాదని, సాంఘిక , సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తుందని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమాలను చేపడతామన్నారు. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సిఐటియు జిల్లా కార్యదర్శి జె. నాగేశ్వరరావు, సిఐటియు నగర న్యూ సిటీ కమిటీ కార్యదర్శి సాయిబాబా, నగర ఉపాధ్యక్షులు టి.రాముడు, సిఐటియు ఓల్డ్ సిటీ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్, న్యూ సిటీ కమిటీ అధ్యక్షులు నరసింహులు ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సిఐటియు నగర నాయకులు ఆటో వర్కర్ సీనియర్ నాయకులు మెహమూద్, మహమ్మద్ రఫీ, వలి,మళ్లీ,కుమార్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సుధాక రప్ప, యేసు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కెజి.గోవిందరెడ్డి. పక్కన నాయకులు

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి...

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన
- రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాన దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జిల్లా కలెక్టర్ డా జి.సృజన సూచించారు. శుక్రవారం స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ ఆవరణంలో ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ డా జి.సృజన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ రక్తదాన దినోత్సవం చాలా ముఖ్యమైన రోజు అని, ఆ రోజున రక్త దానం గురించి ఎంతో మందికి అవగాహన కల్పించుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు. యువతీ యువకులకు రక్తదానం మీద అవగాహన లేకపోవడం, కొన్ని అపోహలు ఉండడం వల్ల రక్తదానం చేసేందుకు వెనుకాడుతున్నారన్నారు. అటువంటి అపోహలను విడనాడి రక్తదానం చేసి రక్తదాతలుగా ఉండటంతో పాటు ఇతరులకు జీవితాన్ని ఇచ్చిన వారు కూడా అవుతారన్నారు. కర్నూలు నగరంలో చూసుకుంటే రెడ్ క్రాస్ సంస్థలో ఏదైనా పెద్ద హాస్పిటల్స్‌లో రక్తదానం ఇవ్వచ్చు అనే విషయం తెలిసి ఉంటుందన్నారు. మారుమూల ప్రాంతాల్లో సదరు అవకాశం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ కెజి.గోవిందరెడ్డి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమాన మన్నారు.. భారతదేశంలో ప్రతి సంవత్సరం 5 కోట్ల బ్లడ్ బ్యాగ్‌లు అవసరం ఉంటే కేవలం 3.5 కోట్ల బ్లడ్ బ్యాగ్‌లను మాత్రమే ఇవ్వగలుగుతున్నామని తెలిపారు. అవసరమైన వారందరికీ రక్తాన్ని అందించడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని, ఇది భారతదేశం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల లక్ష్యమన్నారు. అనంతరం రక్తదాన కార్యక్రమానికి ప్రోత్సహించిన వారికి కలెక్టర్ మెమెంటోలు అందచేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రవీణ్ కుమార్, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, అదనపు డిఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్, రెడ్‌క్రాస్ సొసైటీ కర్నూలు డిస్ట్రిక్ట్ బ్రాంచ్ ట్రెజరర్ రఘునాథ్ రెడ్డి, మాజీ ఛైర్మన్ శ్రీనివాసులు, కమిటీ మెంబర్లు, అరుణ, మధుసూదన్, ప్రభాకర్‌రెడ్డి, నరసింహా, భీమా శంకర్‌రెడ్డి, ఎం జె.బాబురాజు, కెవి.సుబ్బారెడ్డి, మీనాక్షి, సెక్రటరీ వెంకట కృష్ణుడు, మెడికల్ ఆఫీసర్లు కుమారస్వామి రెడ్డి,రామచంద్రరావు, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ రమేష్ బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపి బి.నాగరాజు, కంటిపరీక్షలు చేస్తున్న వైద్యులు

జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

కలెక్టరేట్లోని జిల్లా పౌర సంబంధాల సమాచార శాఖ కార్యాలయంలో శుక్రవారం జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కర్నూలు ఎంపీ బస్తి పాటినాగరాజు ఫోటో వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నగరూరు రాఘవేంద్ర, జిల్లా అధ్యక్షులు మీసాల రామస్వామి, సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయమ్మ ప్రారంభించారు. జర్నలిస్టులకు కంటి పరీక్షలు, బిపి పరీక్షలు చేశారు. వైద్యులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కెవి.సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కెవి.సుబ్బారెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కెజి. గంగాధర్ రెడ్డి. ఆర్కెహాస్పిటల్ డాక్టర్ మనోజ్, శాంతిరాం హాస్పిటల్ డాక్టర్స్ దిలీప్, లక్ష్మీమాన్య, జర్నలిస్టులు మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసులు, చెన్నయ్య రమేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ సృజన

సిఐటియుకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రక్తదాన శిబిరాలను నిర్వహించి రక్తదానం చేస్తున్న వివిధ సంస్థలకు వ్యక్తులకు కలెక్టర్ డాక్టర్ జి.సృజన శుక్రవారం ప్రశంసా పత్రాలను అందజేశారు. సిఐటియు జిల్లా కమిటీ ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా గతేడాది, ఈ ఏడాది రక్తదాన శిబిరాన్ని నిర్వహించడాన్ని ప్రశంసిస్తూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబుకు ప్రశంసా పత్రాన్ని, మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ సిఐటియు పోరాటాలు, ఉద్యమాలు మాత్రమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తుందని తెలిపారు. ప్రశంశా పత్రాలను అందజేసిన రెడ్ క్రాస్ సొసైటీ సంస్థకు, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రానికి పరిశ్రమలు తెస్తాం

పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి. భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఎపిలో పరిశ్రమలు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు తరలివచ్చేలా కృషి చేస్తానని పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి. భరత్ అన్నారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత తొలిసారి ఆయన కర్నూలు జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. మంత్రి టిజి.భరత్ మాట్లాడుతూ.. ఐదు కోట్ల మంది ప్రజలకు మంత్రిగా సేవ చేసే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తనపై నమ్మకంతో మంత్రిగా ఎంపిక చేసి కీలక శాఖలను కేటాయించిన చంద్రబాబు నాయుడికు భరత్ ధన్యవాదాలు తెలిపారు. పారిశ్రామికవేత్తలతో మాట్లాడి రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. తమ ప్రభుత్వంలో పెట్టుబడిదారులను ఆకర్షించి రాయితీలు కల్పిస్తామని చెప్పారు. గతంలో తమ ప్రభుత్వం ఉన్నప్పుడు అనంతపురం జిల్లాకు కియా పరిశ్రమ తీసుకువచ్చినట్లు ఆయన గుర్తు చేశారు. ఓర్వకల్లులో ఇండస్ట్రియల్ జోన్ ఉందని ఎయిర్‌పోర్ట్ కూడా ఉందన్నారు. ఇటీవలే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో మాట్లాడి విజయవాడ నుంచి కర్నూలుకు విమాన సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరినట్లు మంత్రి తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై చర్చిస్తామని చెప్పారు. ఇప్పుడే తమ ప్రభుత్వం కొలువుదీరిందని.. ఒకదాని తర్వాత ఒకదాన్ని స్టడీ చేసి ముందుకు వెళ్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కంటే 100 రెట్లు మంచి పరిపాలన అందిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు కర్నూలులోని సుంకేసుల రోడ్డులో ఉన్న గోదా గోకులంలో టిజి.భరత్ ప్రత్యేక పూజలు చేశారు. ఆ తరువాత సెయింట్ జోసఫ్ కాలేజీ, మున్సిపల్ ఆఫీస్, ఎస్బిఐ సర్కిల్, గాంధీ నగర్, జిల్లా పరిషత్, రాజ్ విహార్ మీదుగా తెలుగుదేశం పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యేలు కెఇ.శ్యామ్ బాబు, దస్తగిరి, పార్థసారథి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, మాజీ మంత్రి కెఇ. ప్రభాకర్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆలూరు ఇంఛార్జ్ వీరభద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. టిడిపి కార్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి టీజీ భరత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. తనను ఆశీర్వదించిన ప్రజలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల దీవెనలతోనే ఈ స్థాయిలో ఉన్నానన్నారు.

మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్ , వేదికపై తిక్కారెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు, నాయకులు

ఓపెన్ టాప్ వాహనంపై కర్నూలులోకి ఊరేగింపుగా వస్తున్న మంత్రి భరత్

చేగువేరాకు డివైఎఫ్ఐ ఘన నివాళి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

త్యాగానికి, పోరాటానికి ఆదర్శానికి నిలువెత్తు నిదర్శనం చేగువేరా అని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ అన్నారు. ప్రపంచ యూత్ ఐకాన్ యువ విప్లవకారుడు చేగువేరా 96వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కార్మిక కర్షక భవన్ నందు పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో నగేష్ మాట్లాడుతూ 1928 జూన్ 14న అర్జెంటీనా దేశంలో జన్మించిన చేగువేరా వారు ఇంట్లో ఉండే సాహిత్యాన్ని చదివి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాలకు ఆకర్షితుడయ్యాడని తెలిపారు. ముఖ్యంగా మెడిసిన్ చదువుతున్న రోజుల్లో లాటిన్ అమెరికా దేశాల్లోని పర్యటించి అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న దుర్భరమైన పరిస్థితులను చూసి చలించిపోయారని తెలిపారు. క్యూబాను సామ్రాజ్యవాదం నుండి రక్షించుకోవడానికి ఫెడల్ కాస్ట్రో నాయకత్వంలో జరుగుతున్న విప్లవ పోరాటంలో పాల్గొని దళ కమాండర్ గా వ్యవహరించి ఆ దేశాన్ని సామ్రాజ్యవాద తొత్తుల నుండి విముక్తి చేయడంలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. క్యూబాలో జాతీయ బ్యాంక్ అధ్యక్షుడుగా, పరిశ్రమల శాఖ మంత్రిగా వ్యవహరించి క్యూబాపై సామ్రాజ్యవాద దేశాలు ముఖ్యంగా అమెరికా అనేక ఆంక్షలను విధించినప్పటికీ ప్రజల మద్దతుతో అక్కడ అందరికీ విద్య, వైద్యం అందుబాటులోకి తీసుకురావడంలో కీలక పాత్ర వహించారని తెలిపారు. క్యూబానుంచి బొలీవియాలో జరుగుతున్న విప్లవ పోరాటంలో పాల్గొనడానికి చేగువేరా వెళ్లాడని తెలిపారు. బొలివియా విప్లవ పోరాటంలో కీలకంగా వ్యవహరిస్తున్న చే గువేరాను అక్కడి వాతావరణం అనుకూలించక హేయ్ నానా ఆరోగ్యం ఫాలో అవ్వడంతో నది దాటుతుండగా పట్టుకొని 1967 అక్టోబర్ 9న సిఐఏ ఏజెంట్లు చేగువేరాను బంధించి శరీర భాగాలన్నీ ముక్కలు ముక్కలు చేసి దుర్మార్గంగా చంపి వేశారని తెలిపారు. చేగువేరా ప్రపంచంలో ఎవరికి ఎక్కడ అన్యాయం జరిగినా స్పందించడానికి సిద్ధంగా ఉండు అని చెప్పడమే కాదు ఆచరణలో చేసి చూపిన వ్యక్తి అని తెలిపారు. డివైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్ బాష, డివైఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు విజయ్, వెంకట రాముడు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, డివైఎఫ్ఐ నాయకులు బజారి, రఫీ పాల్గొన్నారు.

చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

90శాతం సబ్సిడీతో విత్తనాలు అందించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. రామకృష్ణ, మండల కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. సిపిఎం మండల కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. మండల కమిటీ సభ్యులు చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి రామకృష్ణ, మండల కార్యదర్శి బి.నాగన్నలు పాల్గొని మాట్లాడుతూ గత రెండు మూడు సంవత్సరాలుగా సక్రమంగా వర్షాలు కురవక రైతులు వేసిన పంటలు దిగుబడి రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని అప్పుల పాలయ్యారన్నారు. మరొక పక్క నకిలీ విత్తనాలతో తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం అతి తక్కువ వర్షపాతం నమోదు కావడంతో పంటలన్నీ కూడా ఎండిపోయాయన్నారు. కరువు మండలంగా గుర్తించి సహాయక చర్యలలో భాగంగా ఇన్పుట్ సబ్సిడీ రైతులకు అందరికీ అందిస్తామని అందించలేక విఫలమైందన్నారు. తక్షణమే ఖరీఫ్ సీజన్‌లో ఈ ప్రాంతంలో పండించే పంటలు మొక్కజొన్న, ఉల్లి,పత్తి,మిరప, కందులు వేరుశనగ ,ఆముదాలు ,కొర్రలు వివిధ రకాల విత్తనాలు ఎరువులు 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలను అరికట్టాలని ఎరువులు పురుగు మందులు సరసమైన ధరలకు అందించాలని కోరుతూ వచ్చే మంగళవారం నాడు వ్యవసాయ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. ధర్నాలో రాజకీయాలకతీతంగా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. మండల కమిటీ సభ్యులు మధుసూదన్, వెంకటేశ్వర్లు, సుధాకర్, సూర్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది వై.జయరాజు

లాండ్ టైట్లింగ్‌యాక్టు రద్దు పట్ల హర్షం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎపి ముఖ్యమంత్రిగా గురువారం ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు నాయుడు పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే లాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేయడం హర్షించదగిన విషయమని ఎపి హైకోర్టు న్యాయవాది, నేషనల్ లాయర్స్ ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిస్ అండ్ ఈక్వాలిటీ సీనియర్ న్యాయవాది వై. జయరాజు తెలిపారు. చంద్రబాబునాయుడు ఐదు ఫైళ్లపై సంతకం చేసి తన కొత్త ఇన్నింగ్స్‌ను ప్రారంభించారన్నారు. టిడిపి , దాని మిత్రపక్షాలు వాగ్దానం చేసిన లాండ్ టైట్లింగ్ యాక్టు చట్టాన్ని రద్దు చేశారన్నారు. రాష్ట్రంలోని పేద సన్నకారు రైతులకు సంబంధిత వారందరికీ గొప్ప ఉపశమనాన్ని అందించే ఈ వాగ్దానాన్ని నిలబెట్టుకున్నందుకు ముఖ్యమంత్రికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

వేదవతి ప్రాజెక్టును పూర్తి చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు నారాయణ

ప్రజాశక్తి - ఆస్పరి

పెండింగ్‌లో ఉన్న వేదవతి ప్రాజెక్టును పూర్తి చేసి ఆస్పరి మండలానికి సాగు, తాగునీరు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కెవి.నారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నాయకులు బాలకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడారు. ఆస్పరి మండలం ప్రతేడాది కరువు, కాటకాలకు నిలయంగా మారుతోందని తెలిపారు. ఏటా వేలాదిమంది కూలీలు ఉపాధి కోసం పక్క రాష్ట్రాలకు వలసలు వెళ్తున్నారని చెప్పారు. ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురవడంతో వేదవతి నుంచి వందలాది క్యూసెక్కుల నీరు వృథాగా తుంగభద్ర నదిలో కలుస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా కొత్తగా అధికారం చేపట్టిన టిడిపి ప్రభుత్వం ఆస్పరి మండలాన్ని ప్రాజెక్ట పరిధిలోకి చేర్చి మండల ప్రజలను ఆదుకోవాలని కోరారు. సకాలంలో వర్షాలు కురుస్తున్నాయని, ప్రభుత్వం రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను 90 శాతం సబ్సిడీతో అందించాలని డిమాండ్ చేశారు. నకిలీ పత్తి విత్తనాలను అరికట్టాలని, రైతులకు సరిపడిన ఎరువులను సకాలంలో అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు, రైతుసంఘం మండల కార్యదర్శి రంగస్వామి, మల్లేష్, సిఐటియు మండల అధ్యక్షులు రామాంజనేయులు, రవి, ఇబ్రహీం, రామాంజనేయులు, వీరేష్ పాల్గొన్నారు.

జడ్‌పిటిసి పదవికి విరుపాక్షి రాజీనామా

ప్రజాశక్తి - ఆలూరు

కలెక్టర్‌కు రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న విరుపాక్షి

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆలూరు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో, జడ్‌పిటిసిగా ఉన్న బి.విరుపాక్షి శుక్రవారం తన జడ్‌పిటిసి పదవికి రాజీనామా చేశారు. కర్నూలు నగరంలో కలెక్టర్ సృజనకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆలూరు నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందడంతో తన జడ్‌పిటిసి పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. చిప్పగిరి మండలం నుంచి తనను జడ్‌పిటిసిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఆస్పరి జడ్‌పిటిసి దొరబాబు, వైసిపి చిప్పగిరి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, సొసైటీ బ్యాంకు మాజీ అధ్యక్షులు దేగులపాడు మల్లికార్జున, చిప్పగిరి మాజీ ఎంపిటిసి సభ్యులు మల్లికార్జున, మండల మాజీ కోకన్వీనర్ లోకనాథ్, మాజీ కన్వీనర్ బెల్డోన ఓబులేసు, బుసినే శ్రీరాములు, జ్ఞానచంద్ర పాల్గొన్నారు.

చంద్రబాబు హామీల అమలుపై సంబరాలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేయడంపై టిడిపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామంలోని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి, నాయకులు ఎన్.రాఘవేంద్ర స్వగృహంలో మిఠాయిలు పంచి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 5 హామీలపై సంతకాలు చేయడంతో లబ్ధిదారుల్లో ఆనందం నెలకొందని పేర్కొన్నారు. బాధ్యత చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీ అమలుకు, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం, రూ.4 వేలకు పింఛన్ల పెంపుపై మూడో సంతకం, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణకు నాలుగో సంతకం, నైపుణ్యగణనపై ఐదో సంతకం చేసి మాట నిలుపుకున్నారని తెలిపారు. మిగిలిన హామీలను కూడా అమలు చేస్తారని చెప్పారు. ఎన్‌డిఎ ప్రభుత్వం ద్వారా రాష్ట్రాభివృద్ధి పరుగులు పెట్టిస్తుందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతున్నందుకు సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. టిడిపి పార్లమెంట్ ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, పెద్దకడబూరు మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న పాల్గొన్నారు.

మిఠాయిలు తినిపిస్తున్న రాఘవేంద్రరెడ్డి

ఎల్లార్తి దర్గా ఇఒపై రౌడీ షీటర్ దాడి

- హత్య చేసేందుకు యత్నం - అడ్డుపడిన గ్రామస్తులు
- ఇఒకు రక్త గాయాలు - పోలీసు స్టేషన్‌కు తరలింపు

ప్రజాశక్తి - హోళగుంద

ఎల్లార్తి షేక్షావలీ, షాషావలీ సాహెబ్ దర్గాలో వక్ఫ్ బోర్డ్ తరఫున ఇఒగా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ రెహమాన్‌పై ఎల్లార్తికి చెందిన రౌడీ షీటర్ బోయ మల్లికార్జున, అతని అనుచరులు దాడి చేసి గాయపరిచినట్లు ఇఒ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ఎల్లార్తి దర్గాకు జిల్లా మైనార్టీ సంక్షేమ అభివృద్ధి అధికారి సునీల్ వచ్చారని, ఈనెల 21న విజయవాడలోని వక్ఫ్ బోర్డ్ కార్యాలయంలో ఎల్లార్తి దర్గాకు సంబంధించిన వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే దర్గాకు సంబంధించిన 10 మరుగుదొడ్లు, స్నానపు గదులకు సైతం వేలం పాట నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎల్లార్తికి చెందిన దర్గా మాజీ నిర్వాహకుడు మల్లికార్జున తన స్థలంలో నిర్మించారని, వాటికి తాళాలు వేసుకోవడంతో అవి ప్రభుత్వానికి సంబంధించినవని, కోర్ట్ ద్వారా నోటీసులు పంపినట్లు తెలిపారు. వాటి తాళాలు ఇవ్వాలని అధికారులు కోరినా ఇవ్వలేదన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కోపోద్రిక్తుడయిన మల్లికార్జున 'అన్నింటికీ ఇఒ కారణం' అంటూ సంబంధిత అధికారిపై అధికారులందరూ చూస్తుండగా దర్గాలోనే దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో ఇఒ అబ్దుల్ రెహమాన్ కుడి చేతి వేళ్లకు, కాళ్లకు గాయాలయ్యాయి. వీపుపై కర్రలతోనూ, రాళ్లతోనూ దాడికి తెగబడ్డారని కన్నీంటి పర్యంతమయ్యారు. దాడి ఘటనను చూసిన గ్రామస్తులు అడ్డుకోవడంతో ప్రాణహాని తప్పిందని, లేకపోతే హత్య చేసేవాడని వాపోయారు. దర్గాను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న నాటి నుంచి తనపై పగ పెంచుకున్నాడని, ఎక్కడ పడితే అక్కడ తనపై అసభ్యంగా మాట్లాడేవాడని తెలిపారు. మల్లికార్జున, అతని అనుచరులు దర్గాలోని జనరేటర్, కుళాయిలకు చెందిన మోటార్లు తీసుకుపోయినట్లు పోలీసులకు గత రెండు నెలల క్రితం ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తనపై మరింత కోపం పెంచుకొని హత్య చేసేందుకు వచ్చాడని, ఇలాంటి వ్యక్తిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో ఈ వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయలేదని, అధికార పార్టీకి చెందిన వ్యక్తి అని, మంత్రి అనుచరుడని పోలీసులు కూడా ఫిర్యాదును నీరుగార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. రౌడీషీటర్ మల్లికార్జునపై, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇఒ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పెద్దయ్య తెలిపారు.

మాట్లాడుతున్న ఇఒ రెహమాన్

తుంగభద్రకు జలకళ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం సమీపంలో ప్రవహిస్తున్న తుంగభద్ర నదికి జలకళ సంతరించుకుంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర నదిలోకి నీరు చేరుతోంది. మే నెల చివరి వారం వరకు రాష్ట్రంలో సూర్యుడి ప్రతాపానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. తుంగభద్ర నదిలోనే కాక భూమిలో కూడా జలాలు అడుగంటిపోవడంతో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షలతో వాతావరణం చల్లబడడమే కాక తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. కర్ణాటక రాష్ట్రంలో కూడా వర్షాలు విస్తారంగా కురవడంతో తుంగభద్ర నదిపై కర్ణాటక రాష్ట్రం హోస్పేట్‌లో నిర్మించిన డ్యాంలోకి నీరు వచ్చి చేరుతోంది. ఈసారి ముందస్తు వర్షాలు కురవడం వల్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే భూములు చదును చేసుకుని విత్తనాలు నాటే ప్రయత్నాలు చేస్తున్నారు.

నీటితో కళకళలాడుతున్న తుంగభద్ర

ముఖ్యమంత్రి బాబుకు రుణపడి ఉంటాం

- ఆలూరు డివిజన్ ఎంపిఇఒల సంఘం

ప్రజాశక్తి - చిప్పగిరి

ఎంపిఇఒల వ్యవస్థను ఏర్పాటు చేసి తమకు ఒక మంచి దారిని చూపించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎంతో రుణపడి ఉంటామని ఆలూరు డివిజన్ ఎంపిఇఒల సంఘం నాయకులు ప్రతాప్ నాయుడు, రంగస్వామి తెలిపారు. శుక్రవారం చిప్పగిరిలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంపిఇఒల వ్యవస్థను 2015లో ఏర్పాటు చేసి మళ్లీ 2017లో తమ జీతాలను రెట్టింపు చేశారని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో విధుల్లో ఎంత ఒత్తిడి ఉన్నా చేశామని, తమకు ఒక్క రూపాయి జీతం పెంచలేదని విమర్శించారు. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రిగా రావడం తమకు ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. ఎంపిఇఒల వ్యవస్థను రెగ్యులర్ చేసి జీతాలు పెంచుతారని ఆకాంక్షించారు. ఎంపిఇఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిఇఒలు

అపోలో ఫార్మసీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని శివ సర్కిల్ వద్ద ఉన్న నూతన అపోలో ఫార్మసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గుండె వైద్య నిపుణులు సందీప్ కుమార్, జనరల్ ఫిజీషియన్ ఫయాజుద్దీన్ గుండె వైద్య పరీక్షలు, ఈసీజీ, టుడిఈకో, బీపీ, షుగర్ పరీక్షలు, ఉచిత డాక్టర్ పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో అపోలో వినియోదారులకు 270 మంది పాల్గొని పరీక్షలు చేసుకున్నారు. అపోలో ఫార్మసీ సీనియర్ మేనేజర్ మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ... ఈ శిబిరాల ద్వారా ఆరోగ్యంపై అవగాహన పెంపొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా మరిన్నీ వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. అపోలో ఫార్మసీ ఎగ్జిక్యూటివ్‌లు చంద్రశేఖర్, మధుకుమార్, శివ, మారుతి, మహదేవ్, వీరేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుపై హర్షం

ప్రజాశక్తి - ఆదోని

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకం చేయడంపై ఆదోని అడ్వకేట్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సుందర్ సింగ్, ఎం.జనార్ధన్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆదోనిలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం అప్రజాస్వామికంగా, రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. జనరల్ సెక్రటరీ సురేంద్ర కుమార్ మాట్లాడుతూ... ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు సైతం తమ ఆస్తులను కాపాడుకోవాలని, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ లాంటి నల్ల చట్టాలను రద్దు చేయాలని, ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదని ప్రజల్లో ఏర్పడిన భయం గత ప్రభుత్వం ఓడిపోవడానికి కారణమైందని తెలిపారు. జాయింట్ సెక్రటరీ మల్లికార్జున మాట్లాడుతూ... ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ వంటి నల్ల చట్టానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన న్యాయవాదులకు, సహకరించిన ప్రజా సంఘాలకు, రైతు కూలీ సంఘాలకు, కులసంఘాలకు అసోసియేషన్ తరఫున ధన్యవాదాలు తెలిపారు. సీనియర్ న్యాయవాదులు శ్రీధర్ రెడ్డి, గిరిధర్, శ్రీరాములు, హరి సర్వోత్తమ రెడ్డి, వైఆర్.మల్లికార్జున, ఎమ్.ఎమ్.డి.ఇస్మాయిల్, నాగేంద్రయ్య, ఆనంద్, సోమశేఖర్, విజయ భాస్కర్ రెడ్డి, తాయన్న, పద్మదేశాయ్, లోకేష్ కుమార్, వెంకటేష్, రామలింగ, రవికృష్ణ, వీరభద్ర గౌడ్, వీరన్న నాయుడు, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుందర్ సింగ్

టిడిపి ఇన్‌ఛార్జీ ఎవరిది..?

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జీ ఎవరనే ప్రశ్న నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గ పునర్విభజన జరిగిన నాటి నుంచి (2009 నుంచి) పాలకుర్తి తిక్కారెడ్డి నియోజకవర్గ ప్రజలకు సుపరిచితులు. ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఆశించినా దక్కకపోవడంతో కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ నుంచి తన అనుచరుడైన వాల్మీకి వర్గానికి చెందిన దళవాయి రామయ్యకు టికెట్ ఇప్పించారు. నాడు జరిగిన ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి వై.బాలనాగిరెడ్డి చేతిలో సుమారు 7 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. అప్పటికే టిడిపిలో ఉన్న గోతులదొడ్డి ఉలిగయ్య, పల్లెపాడు లక్ష్మిరెడ్డి, రామిరెడ్డి, ముత్తురెడ్డి, మాధవరం రామిరెడ్డి బాలనాగిరెడ్డికి మద్దతు ఇవ్వడంతో నియోజకవర్గ పునర్విభజన తొలి ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డి గుర్తింపు పొందారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేరారు. వైఎస్ఆర్ ఆకస్మికంగా మృతి చెందగా వైఎస్.జగన్మోహన్ రెడ్డి వైసిపిని స్థాపించారు. జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర చేపట్టడం, 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి వైసిపి నుంచి పోటీ చేశారు. అదే వాల్మీకి నాయకులు సహకరించని కారణంగా టిడిపి అభ్యర్థి పి.తిక్కారెడ్డి పది వేలకు పైగా ఓట్ల తేడాతో ఓటమి చవి చూశారు. నాటి నుంచి పార్టీకి, కార్యకర్తలకు అండగా ఉంటూ వచ్చారు. మళ్లీ 2019 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేశారు. ఎమ్మెల్యే సొంత గ్రామాల్లో ప్రచారం చేసేందుకు వెళ్లగా అడ్డుకున్నారు. వైసిపి గ్రూపుతో జరిగిన తోపులాటలో గన్‌మెన్ గన్ పేలి కాలికి గాయమైంది. చికిత్స పూర్తి కాకుండానే రక్త గాయంతో భార్య, సోదరునితో కలిసి ప్రచారం చేపట్టారు. ఆ ఎన్నికల్లో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేతిలో 23 వేలకు పైగా ఓట్లతో ఓడిపోయారు. నాటి నుంచి వైసిపి వేధింపుల నుంచి నాయకులను, కార్యకర్తలను కాపాడుకుంటూ అవసరాలకు ఆదుకుంటూ వచ్చారు. అప్పటికే టిడిపిలో రెండు గ్రూపులుగా విడిపోయారు. ఒకటి తిక్కారెడ్డి గ్రూపు కాగా మరొకటి వాల్మీకి గ్రూపు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా నెల రోజుల పాటు దీక్షలు చేపట్టారు. మాధవరం గ్రామంలో జెండా కట్ట రంగు మార్చడంపై వాల్మీకి నాయకులు స్పందించక పోతే తిక్కారెడ్డి నిరసన చేసి పక్కనే జెండా కట్టను కట్టి పార్టీ పరువును కాపాడారు. అనంతరం 2024 ఎన్నికల్లో ఆయన టిడిపి టికెట్ ఆశించి భంగపడ్డారు. మారిన రాజకీయ పరిణామాల కారణంగా నియోజకవర్గంలో బీసీలు అధికంగా ఉన్నారని, అందులోనూ వాల్మీకులు అధికంగా ఉన్నారని భావించిన టిడిపి అధిష్టానం వాల్మీకి నాయకులైన మాధవరం గ్రామానికి చెందిన నల్లగౌని రాఘవేంద్ర రెడ్డిని టిడిపి అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిపింది. తిక్కారెడ్డికి జిల్లా పార్టీ అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించింది. ఏడు నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థులను గెలిపించాలని ఆదేశించారు. ఈ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి వై.బాలనాగిరెడ్డి చేతిలో టిడిపి అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి 12,853 ఓట్ల మెజార్టీతో ఓటమి పాలయ్యారు. పార్టీకి, నాయకులకు, కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉన్న తిక్కారెడ్డికి ఇన్‌ఛార్జీ బాధ్యతలు ఇస్తారా లేక ఇటీవల టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన రాఘవేంద్ర రెడ్డికి ఇస్తారా అని చర్చించుకుంటున్నారు. పార్టీ అధిష్టానం ఈ అంశంపై అడుగుల ఎటు వైపు వేస్తారో వేచి చూడాలి.

పాలకుర్తి తిక్కారెడ్డి

రాఘవేంద్రరెడ్డి

సొసైటీ ఇన్‌ఛార్జీ సిఇఒగా నరసింహులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి సొసైటీ ఇన్‌ఛార్జీ సిఇఒగా నరసింహులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో సిఇఒగా విధులు నిర్వహించిన అశోక్ కుమార్ ఈనెల 10న రాజీనామా చేశారు. జిల్లా సొసైటీ అధికారులు సీనియర్‌గా ఉన్న బొజ్జి నరసింహులును గుర్తించి ఆస్పరి సొసైటీ ఇన్‌ఛార్జీ సిఇఒగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు అందుబాటులో ఉంటూ సకాలంలో రుణాలు అందిస్తామన్నారు. రుణాలు తీసుకున్న రైతులు చెల్లించి కొత్త రుణం పొందాలని సూచించారు. తాను ఉన్నంత వరకు సొసైటీ బ్యాంకులో ఎలాంటి అవినీతికి తావు లేకుండా అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సూచనలు తప్పనిసరిగా పాటించాలి : ఎఒ జయలక్ష్మి

ప్రజాశక్తి - చిప్పగిరి

రైతులందరూ తమ పరిధిలో ఉన్న వ్యవసాయ శాఖ అధికారుల వ్యవసాయ సూచనలు పాటించాలని, అప్పుడే మంచి దిగుబడి సాధించేందుకు ఆస్కారం ఉంటుందని ఎఒ జయలక్ష్మి తెలిపారు. శుక్రవారం చిప్పగిరి వ్యవసాయ కార్యాలయంలో రైతులకు మంజూరైన వేరుశనగ విత్తనాల బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలానికి 20 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాల బస్తాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కందులు కావాల్సిన రైతులు కూడా వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు. రైతులు పొలాల్లో వేసిన పంటనే వేసుకోకుండా పంట మార్పిడి చేసుకుంటే ఎక్కువ దిగుబడి వస్తుందని చెప్పారు. ఎఇఒ రమాదేవి, అగ్రికల్చర్ అసిస్టెంట్ రాకేష్, ప్రతాప్, రంగస్వామి పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేస్తున్న అధికారులు

తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఉచిత విద్య

- ఒకే కుటుంబంలో ముగ్గురున్నా ఒకరికి ఉచిత విద్య
- నారాయణ ప్రైమ్ స్కూల్ కరస్పాండెంట్ నరేష్ ఆచారి

ప్రజాశక్తి - ఆస్పరి

రెండేళ్లుగా సామాన్య విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దిన నారాయణ ప్రైమ్ స్కూల్‌లో తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తున్నామని, ఒకే కుటుంబంలో ముగ్గురు ఉంటే ఒకరికి ఉచిత విద్య అందిస్తున్నామని నారాయణ ప్రైమ్ స్కూల్ కరస్పాండెంట్ నరేష్ ఆచారి తెలిపారు. శుక్రవారం నారాయణ ప్రైమ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పరి బస్టాండ్ దగ్గర జనార్ధన వెల్డింగ్ షాప్ బ్యాక్ సైడ్ ఉన్న నారాయణ ప్రైమ్ స్కూల్‌లో రెండేళ్లుగా గురుకుల, నవోదయ పోటీ పరీక్షల్లో ఉత్తమ మార్కులు, సీట్లు సాధించినట్లు తెలిపారు. తమ పాఠశాలలో పిల్లలను చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేయాలని కోరారు. తమ పాఠశాలలో కంప్యూటర్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ ద్వారా విద్య, గురుకుల, నవోదయకు ప్రత్యేక కోచింగ్, ఉదయం యోగా నేర్పిస్తున్నట్లు తెలిపారు. దూరప్రాంత విద్యార్థులకు బస్సు సౌకర్యం, హాస్టల్ సౌకర్యం కూడా ఉందన్నారు. ఉపాధ్యాయులు దీప్తి, చంద్రకళ, లావణ్య, వరలక్ష్మి, సౌమ్య, గాయత్రి, అంజినమ్మ, శ్రీదేవి, పద్మావతి, నిర్మల, ఈశ్వర్, బాలు, సంజన, నారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరేష్ ఆచారి

మంత్రివర్గంలో మాదిగలకు చోటు దక్కడంపై జైభీమ్ ఎంఆర్‌పిఎస్ హర్షం

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్ర మంత్రివర్గంలో మాదిగలకు చోటు కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్ధిల్లాలంటూ జైభీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న మాదిగ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని సూగూరు గ్రామంలో మాదిగలతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన మంత్రివర్గంలో వంగలపూడి అనితకు హోమ్‌శాఖ ఇచ్చి పెద్ద పీట వేశారని తెలిపారు. రాబోయే రోజుల్లో దళిత, గిరిజనులను కాపాడుతూ ముందుకు వెళ్తారని, మాదిగలకు గౌరవ స్థానం కల్పించిన ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పార్థసారథికి సన్మానం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని శాలువా, పూలమాలలతో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు సన్మానించారు. ఎంఎస్‌పి జిల్లా నాయకులు బండారి హనుమంతు మాదిగ, ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు బండారి గిడ్డయ్య మాదిగ మాట్లాడారు. మాదిగల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఎంఆర్‌పిఎస్ మాజీ అధికార ప్రతినిధి హెచ్.నరసింహులు మాదిగ, ఆదోని టౌన్ కన్వీనర్ వన్నెల మణికంఠ మాదిగ, ఎంఆర్‌పిఎస్ 8వ వార్డు ఇన్‌ఛార్జీ జిఎస్.దత్తు మాదిగ, ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు దిబ్బనకల్ గంగన్న మాదిగ, హుసేని, మారెప్ప పాల్గొన్నారు.

సన్మానిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఎమ్మెల్యేను కలిసిన సచివాలయ ఉద్యోగులు

పట్టణంలోని వార్డు సచివాలయ వెల్ఫేర్ ఉద్యోగులు ఎమ్మెల్యే పార్థసారథిని కలిశారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో శాలువా కప్పి పూలమాలతో ఎమ్మెల్యే పార్థసారథిని సన్మానించారు. ఈ సందర్భంగా సచివాలయ వార్డు వెల్ఫేర్ సెక్రటరీలు చంద్ర, రవి, అమరేష్ మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంలో వెల్ఫేర్ ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. తమ విధులు, బాధ్యతలను ఎమ్మెల్యేకు వివరించినట్లు తెలిపారు. ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. వార్డు వెల్ఫేర్ సెక్రటరీ శివ నాగరాజు, ఆలూరు చంద్రశేఖర్ ఉన్నారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సచివాలయ ఉద్యోగులు

నూతన బోరు ప్రారంభం

ప్రజాశక్తి - గోనెగండ్ల

తాగునీటి అవసరాల కోసం నూతన బోరును టిడిపి నాయకులు ప్రారంభించారు. శుక్రవారం గోనెగండ్లలోని ప్రాజెక్టు మునక భూముల్లో గల రెండు నీటి బోర్లలో ఒకదానిని ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు గోనెగండ్ల మేజర్ పంచాయతీ సర్పంచి పూజారి హైమావతి, ఆమె భర్త పూజారి చంద్రశేఖర్‌లు వినియోగంలోకి తెచ్చారు. దాదాపు రెండున్నర ఇంచుల నీటిని టిడిపి మండల నాయకులు, మండల కన్వీనర్ నజీర్ సాబ్, ఎన్‌వి.రామాంజినేయులు, తిరుపతయ్య నాయుడు, బేతాల బడేసాబ్, శ్రీధర్ నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఎస్ ట్యాంకులోకి నీటిని వదిలి గ్రామంలోకి తాగునీటి కోసం కుళాయిల ద్వారా సరఫరా చేసేలా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూజారి చంద్రశేఖర్ మాట్లాడారు. గ్రామ ప్రజలు తాగునీటి కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి సహకారంతో తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. గత మూడేళ్లుగా ఈ రెండు బోర్లను వినియోగంలోకి తీసుకురావడానికి చాలా ప్రయత్నం చేశానని, రాజకీయ కారణాల వల్ల వీలు కాలేదని తెలిపారు. ఇప్పుడు అన్ని అడ్డంకులూ తొలగి ఈ నీటిని వినియోగంలోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. నాయకులు బాబునాయుడు, నల్లారెడ్డి, హనుమంతు, చంద్రయ్య పాల్గొన్నారు.

బోరు వద్ద టిడిపి నాయకులు

బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి

- డీఎస్పీ శివ నారాయణ స్వామి

ప్రజాశక్తి - ఆదోని

బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని, సోదరభావం కలిగి పండగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకుని మతసామరస్యాన్ని కాపాడుకుందామని ఆదోని డీఎస్పీ శివ నారాయణ స్వామి తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి అధ్యక్షతన పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. గోవధ నిషేధమని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించి బక్రీద్ పండగను జరుపుకోవాలని సూచించారు. శాంతియుతంగా ప్రార్థన నిర్వహించుకుని ఇతరులకు ఇబ్బంది కలుగకుండా కుర్బానీ చేయాలన్నారు. ఏదైనా సమస్య తలెత్తినా, సంఘటన జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కుర్బాని నిర్వహించుకునే చోట పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి తెలిపారు. పారిశుధ్య సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. గోవధ నిషేధమని, నిబంధనకు విరుద్ధంగా కుర్బాని నిర్వహించకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ముస్లిం మత పెద్ద ఖాజీ అల్తాఫ్ హుస్సేన్ వివరించారు. ట్రైనీ డీఎస్పీ దిరాజ్, సిఐ గోపి, ఇతర పెద్దలు ఉన్నారు.

వైసిపి నాయకునికి సతీవియోగం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణానికి చెందిన వైసిపి నాయకుడు బి.వీరేష్‌కు సతీవియోగం కలిగింది. శుక్రవారం ఆమె మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి తరఫున నాయకులు సురేష్ కుమార్, చిట్టిబాబు, సందీప్, మోజెస్, రాబర్ట్ అందజేసి పరామర్శించారు. మృతుని ఇంటిని సందర్శించి మృతురాలి భర్త వీరేష్‌కు మనోధైర్యం కల్పించి నగదు అందజేశారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని, అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా కల్పించినట్లు వారు తెలిపారు.

కూటమితో రాష్ట్రాభివృద్ధి

- తెలుగు యువత కర్నూలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు మంజునాథ

ప్రజాశక్తి - కోసిగి

కూటమి పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలుగు యువత కర్నూలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఎస్వీ.మంజునాథ్ తెలిపారు. శుక్రవారం తన స్వగ్రామమైన సాతనూరు గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపికి రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పారని, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిరంకుశ పాలనలో ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. మరో 20 ఏళ్లు కూటమి ప్రభుత్వమే రాష్ట్రంలో అధికారంలో ఉంటుందని చెప్పారు. జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ 21 సీట్లలో 21 సీట్లు గెలిచి రికార్డు సృష్టించారని తెలిపారు.

చంద్రబాబు, పవన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, కదిరి.

O.S. No:404/2021

Between:

యనమల కృష్ణవేణి W/o నాగరాజు, Residing as a D.No:28/2-751, నవోదయ కాలనీ, అనంతపురం టౌన్ మరియు జిల్లా. ...Plaintiff

మరియు

D1:యనమల అనురాధ W/o దాశెట్టి శ్రీనివాసులు, Working as ప్రిన్సిపాల్, మెడికల్ కాలేజీ కర్నూల్,

D2:యనమల అరుణ W/o నిరంజన్ రెడ్డి, Working as A.C.T.O. కర్నూల్, ...Defendants

పై దావాలోని D1 and D2 ప్రతివాదికి దావా సమన్లు

పై దావాలోని వాది (యనమల కృష్ణవేణి) ప్రతివాదులు అయినా D1 and D2 మీ పైన మరియు ఇతరులపై భాగపరిస్కారపు దావాను పై కోర్టులో వేసి యున్నారు. పై దావాను ఘనమైన కోర్టు వారు 12/07/2024 వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసి యున్నారు. కావున మీరు 12/07/2024 వ తేదిన ఉదయం 10:30 గంటలకు స్వయంగా కానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపనులు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టు వారు పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:12/07/2024
స్థలం : కదిరి

జి.గురులింగస్వామి, బి.ఎ., బి.ఎల్,
వాదితరుపు వకీలు, కదిరి

జువ్వాజి సుంకన్న గౌడ్ 58 వ వర్ధంతి

జువ్వాజి సుంకన్న గౌడ్‌కు నివాళ్లు అర్పిస్తున్న అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్ , తదితరులు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు ప్రథమ సర్పంచి జువ్వాజి సుంకన్న గౌడ్ 58వ వర్ధంతి సందర్భంగా జువ్వాజీ సుంకరన్న గౌడ్ సేవా సమితి అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జువ్వాజీ సుంకరన్న గౌడ్ నందికొట్కూరు ప్రజలను తన కన్న బిడ్డలలా భావించి వారి భవిష్యత్తు తరాల వారికి, ప్రజలకు ఉపయోగపడే విద్యాసంస్థలు, సంత మార్కెట్, మున్సిపల్ కార్యాలయము, టిటిడి కల్యాణ మండపాలకు, మరెన్నో భూదానాలు చేసి కలియుగ దానకర్ణుడిగా పేరు పొందారని తెలిపారు. జువ్వాజీ సుంకన్న గౌడ్ పేరు మీద జువ్వాజీ సుంకరన్న గౌడ్ సేవా సమితి అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్ శివ భక్తులకు, వికలాంగులకు, వృద్ధులకు, పేదవారికి అన్నదాన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీకాంత్‌గౌడ్ మున్సిపల్ కమిషనర్ టి.సుధాకర్ రెడ్డి అభినందించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వీరకుమార్‌గౌడ్, కిషోర్‌గౌడ్, నవందిశ్రీధర్, సాయిరాం సుధాకర్ రెడ్డి, అల్వాల బాలయ్య, బజాజ్ రంగస్వామి, అడ్వకేట్ సత్యనారాయణ, ఆరుద్రస్వామి, రఘురామమూర్తి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు..

సంక్షేమ హాస్టల్లో ప్రతి విద్యార్థికి సీటు ఇవ్వాలి

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అబ్దుల్లా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ సంక్షేమ హాస్టల్లో ప్రతి విద్యార్థికి సీటు ఇచ్చి హాస్టల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ చాలాసంక్షేమ హాస్టల్లో సరైన మౌలిక వస్తువులు లేవని ప్రధానంగా మరుగుదొడ్లు తాగునీటి సమస్య విరిగిపోయిన డోర్లు పాతబడిన భవనాలు వర్షం పడితే చాలా భవనాలు కారుతున్నాయని, ప్రహరీ గోడలు, డ్రెయినేజీ తదితర సమస్యలు సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. గత ప్రభుత్వం వాటిని పరిష్కారం చేయడంలో విఫలం చెందిందన్నారు. ఈ సమస్యలను గుర్తించి ఈ విద్యా సంవత్సరంలోనైనా కొత్త ప్రభుత్వం ఈ సమస్యల పైన దృష్టి సారించి పరిష్కారం చేయాలన్నారు. ఎందుకంటే సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులంతా పేద బడుగు బలహీన వర్గ విద్యార్థులు చదువుతారని కాబట్టి విద్యార్థుల చదువుకు సమస్యలు ఆటంకం కాకుండా ప్రభుత్వం వెంటనే హాస్టల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి హాస్టల్ సీటు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు అమర్ నగర నాయకులు శివ పాల్గొన్నారు.

ఎపి ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దు పట్ల హర్షం

-పత్తికొండ బార్ కార్యాలయంలో కేక్ కట్ చేసిన న్యాయవాదులు

పత్తికొండలో కేక్ కట్ చేస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-పత్తికొండ

రాష్ట్ర ప్రభుత్వం ఎపి లాండ్ టైటిలింగ్ యాక్టు ను రద్దు చేయడం హర్షణీయమని పత్తికొండ బార్ అసోసియన్ అధ్యక్షుడు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేశ్, సీనియర్ న్యాయవాదులు సురేష్ కుమార్, మైరాముడు, సత్య నారాయణ, చంద్రశేఖరనాయుడు అన్నారు. శుక్రవారం పత్తికొండ పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు కేక్ కట్ చేసి, ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ... ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను వ్యతిరేకిస్తూ గతంలో ఆందోళనలు చేశామన్నారు. ఈ చట్టంలో అనేక లోపాలు ఉన్నాయని, అది అమలు అయితే ప్రజలకు నష్టం కలుగుతుందని న్యాయవాదులు విధులు బహిష్కరించి తమ నిరసనలు, ఆందోళనలు చేశామన్నారు. సివిల్ కేసుల విచారణను కోర్టుల పరిధి నుంచి తొలగించే సెక్షన్లను సవరించాలని డిమాండ్ చేశామన్నారు. ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిల్ యాక్టును రద్దు చేస్తామని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు న్యాయవాదుల తరుపున కతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. బార్ అసోసియేషన్ కోశాధికారి రాజశేఖర్ నాయుడు, సహాయ కార్యదర్శి వాసుదేవ నాయుడు, ఎజిపి నరసింహయ్య, న్యాయవాదులు మల్లికార్జున, నాగేష్, నాగభూషణరెడ్డి, సురేంద్రకుమార్, రమేష్ బాబు, సోమప్ప, నాగలక్ష్మయ్య, బాలబాష, ప్రసాద్ బాబు, నారాయణ స్వామి, జటంగిరాజు, అరుణ్, శ్రీకాంత్ రెడ్డి, వెంకటేశ్వర్లు, సుధాకష్ణ, చిన్న మునెయ్య, మధు, రజాక్, శివకష్ణ, నరసింహులు, ఇలియాజ్, లక్ష్మన్న, సాంబశివ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

కొత్త ప్రభుత్వానికి సిపిఎం సూచన

మాట్లాడుతున్న సీనియర్ నాయకులు రాజగోపాల్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరంలోని, ప్రజలకు నిరంతరం అందు బాటులో ఉంటూ ,వారి సమస్యల పరిష్కారం కోసం, అహర్నిశలు కృషి చేయాలని కొత్త ప్రభుత్వానికి సిపిఎం సీనియర్ నాయకులు, కె .రాజగోపాల్, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ,ఎస్ఎండి షరీఫ్, అబ్దుల్ దేశాయ్ లు సూచించారు. శుక్రవారం స్థానిక సుర్జీత్ భవన్ నందు ఖండేరి వీధి ముఖ్య కార్యకర్తల సమావేశం ,మద్దిలేటి అధ్యక్షతన నిర్వహించారు. రాజగోపాల్, ఎస్ఎండి.షరీఫ్, అబ్దుల్లాలు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన,ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం, కృషి చేయాలనీ కోరారు. వీధులలో ఉండే వివిధ రకాల వృత్తులు చేసుకుంటూ, ఉంటున్న వారికి ప్రభుత్వం ఎటువంటి , షరతులు లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలని కోరారు. ఇళ్ల స్థలాలు లేని వారికి ,స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టించాలని కోరారు. కరెంటు బిల్లులు ఎక్కువ వచ్చాయని, ఇల్లు పెద్దగా ఉందని , మాగానీ భూమి ఉందని ,వాహనాలు ఉన్నాయనే, వివిధ కారణాల పేరుతో ,ఆగిపోయిన అవ్వ, తాతల, పెన్షన్లను, వితంతుల పెన్షన్లను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పంపిణీ చేయకుండా, ఆపివేసిందని ,ఇప్పుడు వచ్చిన నూతన ప్రభుత్వం అర్హులైన వారికి, వారి వారి ఇళ్ళను వారికి ,కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, రాజేంద్ర బాబు, కుమార్, అభిమన్యుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన జడ్‌పి మాజీ చైర్మన్

ప్రజాశక్తి-తుగ్గలి

కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజును, డోన్ శాసనసభ్యులు కోట్లసూర్య ప్రకాష్ రెడ్డిని శుక్రవారం మాజీ జడ్‌పి చైర్మన్ బత్తిన వెంకట రాముడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ బస్తి పాటి నాగరాజును మాజీ జెడ్పీ చైర్మన్ బత్తిన వెంకట రాముడు శాలువా పూలమాలతో సత్కరించి మొమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా బత్తిన వెంకట్ రాముడు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయడంతో పాటు పెండింగ్లో ఉన్న వివిధ అభివృద్ధి పనులను పూర్తి చేస్తుందన్నారు. ఐదేళ్లలో అభివద్ధిలో వెనుక పడిన ప్రాంతాలను అభివద్ధి చేస్తుందన్నారు.

కర్నూల్ ఎంపిగా బస్తి పాటి నాగరాజు ,పత్తికొండ ఎమ్మెల్యే గా కే ఈ శ్యాం కుమార్ లు విజయం సాధించడంతో వెనకబడ్డ పత్తికొండ ప్రాంతంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతాయన్నారు. మాజీ ఎంపిపి కొమ్ము వెంకటేశు ,టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటపతి,టిడిపి యువ నాయకులు బత్తిన కిరణ్, టిడిపి మైనార్టీ నాయకుడు మా బాష తదితరులు పాల్గొన్నారు.

హోంమినిస్టర్ అనిత ఎంపికపై ఎంఆర్‌పిఎస్ హర్షం

ఆంధ్రప్రదేశ్ హోమ్ మినిస్టర్‌గా ఎస్‌సి మాదిగ సామాజిక తరగతికి చెందిన వంగలపూడి అనిత ఎంపిక పట్ల ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి దబ్బల కృష్ణ, జిల్లా నాయకులు దేవేంద్ర హర్షం వ్యక్తం చేశారు. ఎస్‌సి మాదిగ తరగతికి చెందిన అనితను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంపిక చేయడం శుభ పరిణామం అన్నారు. దళితులు కోసం పోరాడే వ్యక్తి అనిత అని అటువంటి మహిళకు హోంమంత్రి ఇయ్యడం హర్షించదగ్గ విషయమని అన్నారు. టిడిపిలో పనిచేసే నాయకులకు,కార్యకర్తలకు ముఖ్యమంత్రి అండగా ఉంటారని తెలిపారు. ఎపిఎంఆర్‌పిఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్తూరు అంజి హర్షం వెలిబుచ్చారు.

సూచనలు చేస్తున్న ఎపిడి

పండ్ల తోటల పెంపకానికి సహకరించాలి: ఎపిడి

ప్రజాశక్తి-తుగ్గలి

పండ్ల తోటల పెంపకానికి ప్రతి ఒక్కరు సహకరించాలని జాతీయ ఉపాధి హామీ పథకం ఎపిడి పక్కీరప్ప అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన తుగ్గలి ఎన్ఆర్ఇజిఎస్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ పిడి పక్కీరప్ప మాట్లాడుతూ తుగ్గలి మండలంలో 600 ఎకరాలలో పండ్లతోటల పెంపకానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రతి రైతు పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి కనపరిచే విధంగా సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కనుక పొలాలలో రైతులు వివిధ పండ్ల మొక్కలను నాటే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. ఐదు ఎకరాల లోపు ఉన్న ప్రతి రైతు పండ్లతోటల పెంపకానికి అర్హులన్నారు. మొక్కలను ఉచితంగానే ఇవ్వడమే కాకుండా దాని పోషించే బాధ్యత కూడా ప్రభుత్వమే తీసుకుంటుందన్నారు. అందుకు ప్రతి రైతు పండ్ల తోటలపై ఆసక్తి కనపరిచే విధంగా ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్లు రత్నం, పెంచలయ్య, కోఆర్డినేటర్ గంగన్న, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం ఐదు సంతకాల పట్ల హర్షం

ప్రజాశక్తి- బండి ఆత్మకూర్

ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడు ఐదు సంతకాలు చేయడంపై మండలంలోని లబ్ధిదారులు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. యడం జరిగింది శుక్రవారం మండల టిడిపి కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షుడు నందిపాటి నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు బి.మల్లేశ్వర్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి కె.చిన్న లింగారెడ్డి, డాక్టర్ భరద్వాజ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరిపాలనలో వెనక్కి తీసుకుపోయిన జగన్ పరిపాలనకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, ఈ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు అన్ని కులాలకు మతాలకు సమాన న్యాయం చేకూరుస్తుందని తెలిపారు. దుర్మార్గమైన చట్టాలను రద్దుచేసి సుపరిపాలన అందించడం చంద్రబాబుకు సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డి సిద్ధయ్య, జాలనందయ్య, జాకీర్ ఖాన్ పాల్గొన్నారు.

పండగలు మతసామరస్యానికి చిహ్నంగా ఉండాలి: ఎస్ఐ

ప్రజాశక్తి - చాగలమర్రి

పండగలు మతసామరస్యానికి చిహ్నంగా ఉండాలని ఎస్ఐ రమణయ్య సూచించారు. చాగలమర్రి పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఈ నెల 17న బక్రీద్ పండుగను పురస్కరించుకొని శుక్రవారం పీస్ కమిటి సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ హిందు, ముస్లీం సోదరులు ఐక్యమత్యంతో మెలగాలన్నారు. పండుగలు ఏవైనా అందరు కలిసి మెలిసి ప్రశాంత వాతావరణంలో చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఖాజీ యూనస్, మాజీ సర్పంచి అన్సర్‌బాషా, చక్రం బీడీ షబ్బీర్, గుత్తినరసింహులు, తొమ్మంద్రు మల్లికార్జున,లక్ష్మణ్‌బాబు, భాస్కర్ రెడ్డి ,హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బక్రీదు పండుగా ప్రశాంతంగా జరుపుకోవాలి : ఎస్ఐ

పజాశక్తి -వెలుగోడు : మండల ముస్లిం మైనారిటీలు బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ భూపాలుడు సూచించారు. శుక్రవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని అన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని తెలిపారు. మైనర్ ద్విచక్ర వాహనాలను నడుపుతూ పట్టుపడితే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులు ప్రయాణం చేయరాదని అన్నారు. ద్విచక్ర, వాహనదారులు అతివేగంగా వాహనాలను నడిపి ప్రమాదాలకు గురికాకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగోడు పట్టణ శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

18న జిల్లా స్థాయి చదరంగం జట్టు ఎంపిక పోటీలు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో 18న సంజీవ నగర్‌లో సంకల్ప్ ఒలింపియాడ్ స్కూల్ ఆవరణలో 11 సంవత్సరాల లోపు బాల బాలికల నంద్యాల జిల్లా చదరంగం జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు రవికృష్ణ తెలిపారు. 16వ తేదీ లోపు ఆసక్తి గల క్రీడాకారులు ఎంట్రీలు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 9010451585 ద్వారా సంప్రదించాలని కోరారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

- ఎంఈఓ కోటయ్య

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించినట్లు ఎంఈఓ కోటయ్య తెలిపారు. శుక్రవారం అయిన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని పాఠశాలలో చేరిన విద్యార్థులను నిలకడగా ఉండేలా చూడాలన్నారు. తల్లిదండ్రులతో కలిసి విద్యా విధానంలో ఉన్న అంశాల గురించి వివరించాలన్నారు. మధ్యాహ్న భోజనంలో పీఎం పోషణ కింద రుచికరమైన భోజనంను వడ్డించాలన్నారు. విద్యార్థులకు ప్రణాళిక ప్రకారము పాఠ్యాంశాలు బోధించాలన్నారు. మొదటి రోజు నుంచి విద్యార్థులకు గణితము, ఆంగ్లము తెలుగు పట్ల వారి సామర్థ్యంను పెంపొందించాలన్నారు. పాఠశాలలో పెండింగ్‌లో ఉన్న నాడు నేడు పనులను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంఈఓ లక్ష్మి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం భర్త పై హత్యయత్నం

ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా గోస్పాడు మండలం పసురపాడు గ్రామానికి చెందిన ఆళ్లగడ్డ వీరశేఖర్ రెడ్డి (60) పైన ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు ముకుమ్మడిగా దాడి చేసి తలపగలగొట్టిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గాయపడ్డ ఆయనను 108 అంబులెన్సు ద్వారా నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఆయన తలకు దాదాపు 15 కుట్లు పడ్డాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను ఇంటిలో భోజనం చేస్తుండగా తన ఆస్తి కోసం తన భార్య, బంధువులు కలిసి హత్యాయత్నానికి పాల్పడుతున్నారని తెలిపారు. తనను ఇంట్లో లేకుండా చేస్తున్నారని, తనకు తెలియకుండానే తన ఆస్తిని కాజేయాలనీ చేస్తున్న ప్రయత్నాన్ని అడ్డుకుంటున్నందుకు తనపైన ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని వీర శేఖర్ రెడ్డి వాపోయాడు. తన భార్య నుండి ఆమె బంధువుల నుండి రక్షణ కల్పించాలని ఆయన పోలీసులను వేడుకున్నాడు. తన పైననే దాడి చేసి నాపైననే వైసీపీ నాయకుల ప్రోద్బాలంతో కేసులు పెట్టిస్తున్నారన్నారు. తనకు న్యాయం చెయ్యాలని, తన భార్య తాలూకా బంధువుల నుండి రక్షణ కల్పించాలని వీర శేఖర్ రెడ్డి వేడుకున్నారు.

చేగువేరా నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్

ప్రజాశక్తి - బేతంచెర్ల

చేగువేరా నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వై ఉదయ్, మండల కార్యదర్శి ప్రదీప్ పేర్కొన్నారు. బేతంచెర్ల పట్టణం లోని సిపిఐ కార్యాలయంలో ఆధ్వర్యంలో విప్లవ వేగుచుక్క చేగువేరా 91వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చేగువేరా అంటే ఎవరో తెలియకుండానే ఫ్యాషన్‌గా టీ షర్టు, క్యాప్‌లపై గుర్తులు వేసుకొని తిరిగే యువతను ఈనాడు ఎందరో చూస్తున్నామని, చేగువేరా గురించి తెలుసుకోవడానికి సంసిద్ధత ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి భాస్కర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు మనోహర్, హరి, బాబు, వెంకటాచారి, సాయి, రాంబాబు, చరణ్ కుమార్, వినయ్ పాల్గొన్నారు.

వాగ్దానాలను నెరవేర్చిన చంద్రబాబు నాయుడు

శ్రీశైలం మల్లన్నకు 101 కొబ్బరికాయలు సమర్పణ

ప్రజాశక్తి- శ్రీశైలం

రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మొదటిరోజే మొదటి సంతకం మెగా డిఎస్‌సిపై సంతకం చేసి ప్రజలకిచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. వితంతువులు,వికలాంగుల పెన్షన్ నాలుగు వేలు చేస్తూ అన్నా క్యాంటీన్ల ఫైల్ పై మొదటి 5 హామీలపై సంతకం చేసి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెరవేర్చిన సందర్భంగా శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామివారికి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాలతో టిడిపి సీనియర్ నాయకుడు ఉండవల్లి శ్రీనివాసరెడ్డి, జనసేన ఇంచార్జ్ రౌతు అశోక్ కుమార్, బిజెపి నాయకుల ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు శ్రీ స్వామి అమ్మవారికి 101 కొబ్బరికాయలు సమర్పించారు. టిడిపి, బిజెపి, జనసేన నాయకులు కార్యకర్తలు నూట ఒక్క కొబ్బరికాయలు కొట్టారు.

విద్యార్థులకు పాఠ్య,నోట్ పుస్తకాలు పంపిణీ

పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎం.వెంకట్రామిరెడ్డి , తదితరులు

ప్రజాశక్తి-డోన్ : డోన్ పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో, ఇష్టపడి చదివితే మంచి ఫలితం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యవిషయాలను శ్రద్ధతో విని పఠించి, అర్థం కాని విషయాలను మళ్ళీ తెలుసుకొని రాణించాలన్నారు. గత సంవత్సరం మన పాఠశాలలో 600 మార్కులకు 570 మార్కులతో తేజవర్ధన్ మొదటి స్థానంలో,568 మార్కులతో ఉదయకుమార్ రెండవ స్థానంలో నిలవడమే కాకుండా, డోన్ మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు టాపర్లుగా నిలిచారన్నారు. పాఠశాలకు మంచి పేరు తెచ్చారన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు వెంకట రమణ, సుబ్బారాయుడు, సంజీవరెడ్డి, భూకాంతరెడ్డి, బాబు, శ్రీనివాసులు, రఘునాథ్, రమేష్, శ్రీనివాసులు, విజయకుమార్, దేవేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు బనగానపల్లెకు మంత్రి బీసీ రాక

ప్రజాశక్తి-బనగానపల్లె

బనగానపల్లె ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి మొదటిసారిగా శనివారం బనగానపల్లెకు రానున్నారు. ప్రమాణస్వీకారం చేశాక మొదటిసారి బనగానపల్లెకు వస్తున్న సందర్భంగా గోర్లగుట్ట-గోవిందిన్నె వద్ద ఈనెల 15న సాయంత్రం 4 గంటలకు ఘన స్వాగతం పలికి అనంతరం ర్యాలీ కార్యక్రమం ఉంటుందని టిడిపి నాయకులు తెలిపారు. బనగానపల్లె నియోజకవర్గ ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇంచార్జీలు, క్లస్టర్ ఇంచార్జీలు, పార్టీ కుటుంబ సభ్యులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బిసి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు ,పెట్టుబడులు శాఖల మంత్రిగా అవకాశం ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు హదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

న్యాయవాదుల సంబరావు

ప్రజాశక్తి-ఆళ్లగడ్డ

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేస్తూ ఫైల్‌పై సిఎం చంద్రబాబు సంతకం పెట్టడంతో ఆళ్లగడ్డ అడ్వకేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణంలో ఆళ్లగడ్డ అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షులు రమణయ్య, ఉపాధ్యక్షులు మురళీధర్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో భూ యజమానుల హక్కులకు పలు విధాలుగా భంగం కలిగిందన్నారు. ఎన్నికలలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా ఎన్నికైన భూమా అఖిలప్రియకు శు భాకాంక్షలు తెలిపారు. న్యాయవాదులు పి.సుబ్బరామిరెడ్డి, మధు, మురళి బాబు, ఖాజా హుస్సేన్, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, నరసయ్య, రఘురామి రెడ్డి, సుదర్శన్, వెంకటయ్య, గణేష్, గాజుల చందన, శ్రావణి, లత, సువర్ణ, నాగమణి, షర్ఫుద్దిన్, శ్రీనివాసులు, ఓబులేసు, దాదా పీర్, కంబగిరి రాముడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారులకు అంతరాయం

ప్రజాశక్తి-బనగానపల్లె

బనగానపల్లె పట్టణ , పరిసర గ్రామాల ప్రజల విద్యుత్ వినియోగదారులకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని విద్యుత్ ఎఇ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. 3వ శనివారం సందర్భంగా ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంట వరకు బనగానపల్లె సబ్ స్టేషన్, పాతపాడు సబ్ స్టేషన్ ,పసుపుల సబ్ స్టేషన్ లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ ఎఇ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.